సాక్షి పల్నాడు


ఆదివారం । 25 । ఫిబ్రవరి । 2024

I



పోలేరమ్మ తల్లి వార్షికోత్సవం

బాపట్ల: బాపట్ల పట్టణం బావరాజుతోటలోని పోలేరమ్మ తల్లి మొదటి వార్షికోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 516.60 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



వైభవంగా వేణుగోపాలుడి కల్యాణం

కోడూరు: హంసలదీవి వేణుగోపాలుడి కల్యాణం వైభవోపేతంగా సాగింది. ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివార్ల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

పానకాల స్వామికి దుర్గగుడి తరఫున పట్టువస్త్రాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని గుంటూరు జిల్లా మంగళగిరిలో వేంచేసిన పానకాల లక్ష్మీనరసింహ స్వామి వారికి శనివారం తెప్పోత్సవం నిర్వహించారు. సీతానగరంలో ప్రారంభమైన తెప్పోత్సవం దుర్గాఘాట్‌కు చేరుకోగా స్వామిని దుర్గగుడి ఈఓ కె.ఎస్.రామారావు దర్శించుకుని పట్టువస్త్రాలను సమర్పించారు. తొలుత స్వామి వారు సీతానగరంలోని శ్రీ మద్విరాంజనేయ సమేత శ్రీకోదండ రామా స్వామి వారి దేవస్థానానికి విచ్చేయగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘమాసంలో స్వామికి కృష్ణానదిలో తెప్పోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని, ఈ ఏడాది నుంచి స్వామికి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం తరఫున పట్టువస్త్రాలను సమర్పిస్తున్నామని పేర్కొన్నారు. స్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన అనంతరం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దుర్గాఘాట్‌లో తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వైదిక కమిటీ సభ్యులు శంకర శాండిల్య, ఇతర అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఒత్తిడి లేకుండా చదివితే మంచి మార్కులు

రాష్ట్ర పరీక్షల విభాగం డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు



అద్దంకి రూరల్: పదవ తరగతి విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా కష్టపడి చదివితే మంచి మార్కులు వస్తాయని రాష్ట్ర పరీక్షల విభాగం డిప్యూటీ కమిషనర్ కే శ్రీనివాసులు అన్నారు. శనివారం సాయంత్రం చక్రాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు పరీక్షలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పాఠశాలలో జరుగుతున్న అల్పాహార కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో హెచ్ఎం కేవీ శ్రీనివాసరావు ఉపాధ్యాయులు కె.వీరాంజనేయులు, అంకారావు, కె.జయలక్ష్మి పాల్గొన్నారు.

27న ఉద్యోగుల గ్రీవెన్స్ డే

నరసరావుపేట: పల్నాడు రోడ్డులోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో ఈ నెల 27న ఉద్యోగుల కోసం గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి శనివారం పేర్కొన్నారు. జిల్లాలో పనిచేసే ఉద్యోగులకు జీతాలు పొందటంలో ఏదైనా సమస్య ఉంటే గ్రీవెన్స్‌కు హాజరై వినతిపత్రాలు అందజేయాలని ఆయన కోరారు.

28న శివరాత్రి సమన్వయ కమిటీ సమావేశం

అమరావతి: అమరేశ్వరస్వామి మహాశివ రాత్రి ఉత్సవ సమన్వయ కమిటీ సమావేశం ఈ నెల 28వ తేదీన నిర్వహిస్తున్నట్లు దేవాలయ కార్యనిర్వహణాధికారి వేమూరి గోపీనాథశర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి వి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో 28వ తేదీ సాయంత్రం 3 గంటలకు ఆలయ ప్రాంగణంలో నిర్వహించే రెండవ సమన్వయ కమిటీ సమావేశానికి అధికారులందరూ నివేదికలతో హాజరు కావాలని కోరారు.

పాతకాపుల వైపే మొగ్గు

తెనాలిలో ఆలపాటి రాజా వర్గం..సత్తెనపల్లిలో కోడెల శివరాం వర్గం గరం..గరం

- తన సామాజికవర్గానికే పెద్దపీట
- గుంటూరుపై తేల్చని వైనం
- తాడికొండలో శ్రీదేవికి మొండిచెయ్యి
- పల్నాడులో మూడు సీట్లు పెండింగ్
- టీడీపీ–జనసేన జాబితాపై ఆందోళన వ్యక్తంచేస్తున్న కేడర్



సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఉమ్మడి గుంటూరు జిల్లాలో తెలుగుదేశం–జనసేన సీట్ల ప్రకటన కొత్త సీసాలో పాతనీరులా ఉందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అసలు ప్రయోగాలు చేయడానికే భయపడ్డట్టు కనపడుతోంది. ఒకటి రెండు సీట్లు మినహాయిస్తే అన్ని సీట్లు గత ఎన్నికల్లో పోటీ చేసిన వారికే కేటాయించడం గమనార్హం. గుంటూరు తూర్పు, పశ్చిమలో మైనారిటీ, బీసీ మహిళలు నూరి ఫాతిమా, విడదల రజినీలకు వైఎస్సార్ సీపీ టికెట్‌లు కేటాయించడంతో అక్కడ కొత్త అభ్యర్థుల వేటలో తెలుగుదేశం ఉంది. దీంతో ఆ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించలేదు. తనకు సీటు లేదని తేలడంతో గోడ దూకిన తాడికొండ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవికి తెలుగుదేశం పార్టీ మొండిచెయ్యి చూపించింది. టికెట్ ఇస్తామన్న హామీ ఇవ్వడంతో ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశానికి ఓటు వేయడమే కాకుండా అమరావతి ఉద్యమంలో పాల్గొనడం, చంద్రబాబు, లోకేష్‌లను పొగడ్తలతో ముంచెత్తుతున్న శ్రీదేవికి ఈ టికెట్ల ప్రకటన షాక్ ఇచ్చింది.

నమ్ముకుని వచ్చిన వారిని నట్టేట ముంచుతాడన్న వాదనకు చంద్రబాబు నిర్ణయం బలాన్ని ఇచ్చింది. తాడికొండ సీటుగాని, కృష్ణాజిల్లా తిరువూరు సీటుగాని కేటాయించాలంటూ చంద్రబాబు, లోకేష్‌ల చుట్టూ ప్రదక్షిణలు చేసినా పట్టించుకోలేదు. తిరువూరు సీటును అమరావతి ఉద్యమంలో పనిచేసిన కొలికపూడి శ్రీనివాస్‌కు కేటాయించారు. తాడికొండ సీటును గుంటూరు జిల్లా పార్టీ అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్‌కు ప్రకటించారు. గుంటూరు జిల్లాలో ప్రకటించిన వాటిలో మూడు సీట్లు కూడా పాతవారికే కేటాయించారు. మంగళగిరి లోకేష్, పొన్నూరు నరేంద్ర, తాడికొండ శ్రావణ్‌కుమార్, ప్రత్తిపాడు సీటును బూర్ల రామాంజనేయులుకు కేటాయించగా తెనాలి సీటును జనసేన తరఫున నాదెండ్ల మనోహర్‌కు కేటాయించారు. బాపట్ల జిల్లాలో రేపల్లె సిట్టింగ్ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, బాపట్ల వేగ్నేశన నరేంద్రవర్మ, వేమూరు మాజీ మంత్రి నక్కా ఆనందబాబుకు కేటాయించారు. పల్నాడు జిల్లాలో వినుకొండ జీవీ ఆంజనేయులు, సత్తెనపల్లి కన్నా లక్ష్మీనారాయణ, చిలకలూరిపేట ప్రత్తిపాటి పుల్లారావు, మాచర్ల జూలకంటి బ్రహ్మారెడ్డికి కేటాయించారు. గురజాలలో యరపతినేని శ్రీనివాసరావుకు టికెట్ ఇవ్వకుండా ఆపారు. పెదకూరపాడు కొమ్మాలపాటి శ్రీధర్, బాష్యం ప్రవీణ్ మధ్య పోటీ నెలకొనడంతో దాన్ని కూడా పెండింగ్ పెట్టారు. లావు శ్రీకృష్ణదేవరాయలు తనతోపాటు జంగా కృష్ణమూర్తికి సీటు ఇవ్వాలని పట్టుపడుతుండటంతో గురజాల, నరసరావుపేట సీట్లను పెండింగ్‌లో పెట్టినట్లు చెబుతున్నారు. అభ్యర్థుల ప్రకటనతో తెనాలిలో ఆలపాటి రాజా వర్గం, సత్తెనపల్లిలో కోడెల శివరామ్ వర్గం ఆగ్రహంతో ఉన్నాయి.


నిమ్మకాయల ధరలు



గుంటూరు: జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.5600, గరిష్ఠ ధర రూ.7300, మోడల్ ధర రూ.6300 వరకు పలికింది.

యరపతినేనికి పొగబెట్టిన బాబు

- టీడీపీ తొలి జాబితాలో పల్నాడులో నాలుగు స్థానాలు ప్రకటన
- తన పేరు గల్లంతుతో తీవ్ర ఆందోళనలో యరపతినేని శ్రీనివాస్
- పెదకూరపాడు, నరసరావుపేట ఆశావహుల్లో ఆందోళన
- కొమ్మాలపాటి శ్రీధర్ పేరు లేకపోవడంతో ఆందోళనలో పెదకూరపాడు తెలుగు తమ్ముళ్లు
- కన్నాకు సీటు కేటాయింపుతో భగ్గుమన్న కోడెల వర్గం
- తొలి జాబితా ప్రకటనతో పచ్చపార్టీలో అసమ్మతి సెగలు



సాక్షి, నరసరావుపేట: తెలుగుదేశం పార్టీ ప్రకటించిన 2024 ఎన్నికల అభ్యర్థుల తొలిజాబితా పల్నాడు జిల్లాలో అసమ్మతి సెగలు రగిలేలా చేసింది. జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలకు నాలుగు నియోజకవర్గాలలో పోటీ చేసే అభ్యర్థుల పేర్లే ప్రకటించింది. ఇందులో గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతి శ్రీనివాసరావు పేరు గల్లంతైంది. తాను జిల్లాలో సీనియర్ నాయకుడినని, చంద్రబాబుకు తాను ఎంత చెబితే అంత అంటూ ప్రగల్బాలు పలికే యరపతినేనికి చంద్రబాబు పెద్ద ఝలక్ ఇచ్చారనే చెప్పాలి. కొత్తగా పార్టీలో చేరిన కన్నా లక్ష్మీనారాయణ పేరు సైతం సత్తెనపల్లి నియోజకవర్గానికి ప్రకటించారు. ఆరుసార్లు గురజాల నుంచి పోటీ చేసిన యరపతినేనికి మాత్రం బాబు మొండిచేయి చూపాడు. దీంతో యరపతినేని తీవ్ర ఆందోళనలో ఉన్నట్టు తెలుస్తోంది. గురజాల నుంచి యరపతినేని దాదాపుగా దూరమైనట్టే అనే ఆవేదన ఆయన వర్గం అనుచరుల్లో కనిపిస్తోంది. నరసరావుపేటకు వలస వెళ్లాల్సి వస్తుందన్న వాదన వినిపిస్తోంది. యరపతినేనికి కాకుండా మరెవరు పోటీ చేసినా సహకరించేది లేదని ఆయన అనుచరులు తెగేసి చెబుతున్నారు.

కోడెల వర్గం ఆగ్రహం

సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి అభ్యర్థిగా కన్నా లక్ష్మీనారాయణ పేరు ప్రకటించడం పట్ల మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్‌రావు వర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. తన రాజకీయ జీవితమంతా టీడీపీపై పోరాటం చేసిన కన్నాకు సత్తెనపల్లి టికెట్ ఇవ్వడమేంటని ప్రశ్నిస్తోంది. టీడీపీ ఆవిర్భావం నుంచి చనిపోయే వరకు పార్టీ కోసం ప్రాణాలిచ్చిన కోడెల కుటుంబానికి అన్యాయం చేశారంటూ వ్యాఖ్యానిస్తున్నారు. కోడెల శివరాం ఇండిపెండెంట్‌గా అయినా పోటీ చేస్తారు గానీ కన్నాకు సహకరించేది లేదంటూ తేల్చి చెబుతున్నారు.

భాష్యం కోసమే జాప్యం..?

తొలి జాబితాలో పెదకూరపాడు నియోజకవర్గ అభ్యర్థిపేరు సైతం లేదు. ఈ స్థానం కోసం మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, భాష్యం ప్రవీణ్‌లు పోటీ పడుతున్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి పార్టీ కోసం దశాబ్దానికిపైగా కృషి చేసిన శ్రీధర్‌కు కాకుండా డబ్బు సంచులతో వస్తున్న భాష్యం ప్రవీణ్‌కు ఇవ్వాలని పార్టీ అధిష్టానం ఆలోచిస్తోందని, అందులో భాగంగానే జాబితాలో శ్రీధర్ పేరు లేదని ఆయన వర్గం ఆవేదన చెందుతోంది. శ్రీధర్‌కు టికెట్ ఇవ్వకపోతే పార్టీ కోసం పనిచేసేది లేదని ఇప్పటికే అధిష్టానానికి తేల్చి చెప్పామని, పార్టీ నిర్ణయం మేరకు భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని చెబుతున్నారు. మరోవైపు నరసరావుపేట తెలుగు తమ్ముళ్ల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. ఇక్కడ టీడీపీ పోటీ చేస్తుందా, పొత్తులో భాగంగా జనసేన, బీజేపీలకు కేటాయిస్తుందో తెలియని పరిస్థితి, ఒకవేళ టీడీపీ పోటీలో ఉన్న అరడజను పేర్లు వినిపిస్తున్న నేపథ్యంలో ఉత్కంఠ నెలకొంది. ఎవరో ఒకరి పేరు త్వరగా తేల్చాలని అధిష్టానంపై పచ్చపార్టీ కార్యకర్తలు ఒత్తిడి తెస్తున్నారు. చిలకలూరిపేట అభ్యర్థిగా మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పేరు ఉండటం కూడా ఆ పార్టీలో అసంతృప్తి నెలకొంది. ఆయనకు వ్యతిరేకంగా ఉన్న వర్గం భాష్యం ప్రవీణ్‌ను ప్రోత్సహించింది. ప్రవీణ్‌కు పెదకూరపాడు సీటు ఇచ్చే ఆలోచనలో అధిష్టానం ఉన్న నేపథ్యంలో చిలకలూరిపేటకు మరో కొత్త అభ్యర్థిని ప్రకటించాల్సిందని, పుల్లారావుతో పనిచేయలేమని పెదవివిరుస్తున్నారు. మాచర్ల అభ్యర్థిగా జూలకంటి బ్రహ్మారెడ్డి పేరును ప్రకటించారు. ఆయనకు నియోజకవర్గంలో కోడెల వర్గంగా పేరు పొందిన కొంతమంది సహకరించేందుకు అంతగా ఉత్సాహం చూపడం లేదు. జూలకంటి ఫ్యాక్షన్ పోకడలు నచ్చక చలమారెడ్డి పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన విషయం తెలిసిందే. దీంతో మాచర్లలో టీడీపీ ఏమాత్రం పోటీ ఇవ్వలేదన వాదన వినిపిస్తోంది.

క్లుప్తంగా

అచ్చంపేట మహిళకు నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్

54 అంగుళాల పొడవు గల జడతో చోటు



అచ్చంపేట: ప్రముఖ వైద్యులు మహిళ్లపల్లి మధుసూదనరావు సతీమణి మామిళ్లపల్లి విజయలక్ష్మి నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించారు. ఈ సందర్భంగా శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. శిరోజాలు బాగా పెరగడం అనేది వంశపారంపర్య లక్షణంగా తమ కుటుంబంలో వచ్చిందన్నారు. 54 అంగుళాల పొడవు గల తన జడను పెద్ద కుమారుడు మామిళ్లపల్లి ప్రవీణ్‌కుమార్ కొన్ని ఫోటోలు తీసి నోబుల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌కు పంపారని తెలిపారు. వారు పరిశీలించిన పిమ్మట తనకు సర్టిఫికేట్‌తో పాటు పురస్కారాన్ని పంపినట్లు చెప్పారు. ప్రపంచ స్థాయి అవార్డు పొందటం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.

నేడు ఎయిమ్స్ జాతికి అంకితం



గుంటూరు మెడికల్: కేంద్ర ప్రభుత్వం మంగళగిరిలో అత్యంత ప్రతిష్టాత్మంగా నిర్మించిన అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ ఎయిమ్స్‌ను ఆదివారం వర్చువల్ విధానంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ జాతికి అంకితం చేయనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ శనివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి విచ్చేయనున్నట్లు వెల్లడించారు. మంగళగిరి ఎయిమ్స్‌ను ఆదివారం మధ్యాహ్నం ప్రధాని నరేంద్రమోదీ జాతికి అంకితం చేస్తారని, ఆన్‌లైన్ విధానంలో ప్రారంభోత్సవంతో పాటు తొమ్మిది క్రిటికల్ కేర్ బ్లాక్‌లకు శంకుస్థాపన చేస్తారన్నారు. విశాఖపట్నంలో మైక్రోబయాలజీ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్, రాష్ట్రవ్యాప్తంగా నాలుగు మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లను ప్రారంభిస్తారని చెప్పారు. 'ఆరోగ్యకరమైన భారతదేశాన్ని, అభివృద్ధి చెందిన భారతదేశాన్ని సష్టించడం, దేశంలోని ప్రతి పౌరుడు సకాలంలో నాణ్యమైన ఆరోగ్య సదుపాయాలను పొందాలనేది ప్రధానమంత్రి ఆకాంక్ష అని పేర్కొన్నారు. ప్రజలు ఎయిమ్స్ ప్రారంభోత్సవంలో పాలు పంచుకోవాలని జయప్రకాష్ నారాయణ కోరారు.

ఎన్నికల విధులపై పోలీసు అధికారులకు శిక్షణ

నరసరావుపేట: పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిర హాలులో సార్వత్రిక ఎన్నికలు-2024పై పోలీస్ అధికారులకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఐపీసీ, సీఆర్‌పీసీ, ఇతర చట్టాలు, ఎన్నికల నియమ నిబంధనలు, పోలీసుల విధుల గురించి ప్రముఖ న్యాయ నిపుణులు, సీనియర్ పోలీస్ అధికారులు అవగాహన కల్పించారు. ప్రజాచట్టం-1951 గురించి డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ మధుసూదనరావు, ఐపీసీ, సీఆర్‌పీసీలలోని ఎన్నికలకు సంబంధించిన విషయాలను న్యాయవాది బగ్గీ నరసింహారావు వివరించారు. పలు చట్టాలు, నియమ నిబంధనలు గురించి జిల్లా కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ దేశిరెడ్డి మల్లారెడ్డి, సబ్‌కోర్టు పీపీ బుచ్చిదంతాచారి, అచ్చంపేట, అమరావతి, పిడుగురాళ్ల సీఐలు కె.కాలేషావలి, ఏవీ బ్రహ్మం, వీరాంజనేయులు, డీసీఆర్‌బీ సీఐ ఏ.అశోక్‌కుమార్, జిల్లా డీఎల్ఎంటీ ఏ.వెంకటరెడ్డి తెలియజేశారు. అవగాహన కార్యక్రమంలో పలువురు అధికారులకు సిబ్బంది దుశ్శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా సత్కరించారు.



మధుసూదనరావును సన్మానించిన డీఎస్పీ వర్మ, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

లారీ - ఆర్టీసీ బస్సు ఢీ

ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలు

మాచర్ల రూరల్: ఆర్టీసీ బస్సు, లారీ ఎదురుగా వచ్చి ఢీకొన్న సంఘటనలో ఇద్దరు డ్రైవర్లు తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం తెల్లవారుజామున రాయవరం గ్రామ జంక్షన్‌లో చోటుచేసుకుంది.

పొదిలి ఆర్టీసీ డిపోకు చెందిన ఇంద్ర బస్సు, మాచర్ల నుంచి నెల్లూరు వెళ్తున్న లారీ రాయవరం గ్రామ సమీపంలోని సబ్ స్టేషన్ వద్దకు చేరుకోగానే ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో లారీ డ్రైవర్ బొక్కసం సాంబశివరావు క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. రెండు కాళ్లు విరిగిపోవడంతో పాటు తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆర్టీసీ బస్సు డ్రైవర్ దీరం వెంకట్రావు కాలు విరిగింది. ప్రమాదంతో రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించిపోయింది. రూరల్ ఎస్ఐ రాజశేఖర్ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని లారీ క్యాబిన్‌లో ఇరుక్కొన్న డ్రైవర్ సాంబశివరావును క్రేన్ ద్వారా బయటకు తీశారు. అతడితో పాటు ఆర్టీసీ డ్రైవర్ వెంకట్రావును నర్సరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్రేన్ సాయంతో వాహనాలను రోడ్డు పక్కకు జరిపి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సంక్షేమాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా
- ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎంపీడీవోలతో సమీక్ష

గుంటూరు ఎడ్యుకేషన్: సంక్షేమాభివృద్ధి లక్ష్యాలను చేరుకునే విధంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలని ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. శనివారం గుంటూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో ఎంపీడీవోలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన ఎంపీడీఓలతో ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతోపాటు మంజూరైన, పెండింగ్‌లో ఉన్న పనులు, 15వ ఆర్థిక సంఘ పనులపై సమీక్షించారు. హెనీ క్రిస్టినా మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా జెడ్పీకి 2,500 ఎకరాల భూములు, ఆస్తులు ఉన్నాయని, వాటిని అన్యాక్రాంతంగా కాకుండా పరిరక్షించడంలో ఎంపీడీఓలు ముఖ్యమైనపాత్ర పోషించాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటిఎద్దటి నివారణకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు.

కోడ్ వచ్చేలోపు పనులన్నీ పూర్తి చేయాలి

జెడ్పీ సీఈఓ ఎస్ఎస్‌వీబీ వసంత రాయుడు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వచ్చేలోపు మంజూరు చేసిన పనులన్నింటినీ పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓలను ఆదేశించారు. సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని, దానికి అనుగుణంగా పని చేయాలన్నారు. ఎంపీడీఓలు తమ పరిధిలో మంజూరైన పనులపై సమగ్రమైన నివేదిక సిద్ధం చేసుకోవాలని, పురోగతిలో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న కత్తెర హెనీ క్రిస్టినా

నియామకాలు, ఉద్యోగోన్నతులు...

జెడ్పీ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా కారుణ్య, బ్యాగ్‌లాగ్ నియామకాలతో పాటు ఉద్యోగోన్నతులు పొందినవారికి జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, సీఈఓ వసంతరాయుడు ఆర్డర్లు అందజేశారు. ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి మోహన్‌రావు, జెడ్పీ అకౌంట్స్ అధికారి పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు అండగా ఉండాలి

దైవ సేవకుల సదస్సులో అంతర్జాతీయ సువార్తీకులు డాక్టర్ వైఎస్. విమలారెడ్డి

నరసరావుపేట: రాష్ట్రంలో పేదలకు అండగా నిలబడిన ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి దైవ సేవకులు (పాస్టర్లు) మద్దతు తెలియచేయాలని అంతర్జాతీయ సువార్తీకులు డాక్టర్ వైఎస్. విమలారెడ్డి కోరారు. పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలోని జమిందారు ఫంక్షన్ హాలులో శనివారం నిర్వహించిన దైవ సేవకుల సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై తన సందేశం ఇచ్చారు. బైబిలులోని దేవుడి సందేశాన్ని చదువుతూ దైవ సేవకులు పాటించాల్సిన నియమాలు, తద్వారా వారికి చేకూరే ప్రయోజనాల గురించి వివరించారు. బైబిలులో చెప్పిన మాదిరి నాయకుడి లక్షణం సీఎం జగన్‌లో చూశానని చెప్పారు. ఇటువంటి వారిని తప్పకుండా దేవుడు ఆశీర్వదిస్తాడన్నారు. ఈ ప్రభుత్వమే కొనసాగాలని, పేదలకు వచ్చే పథకాలు ఆగకుండా ఉండాలని ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ చేసే ప్రార్థనలో కొంత సమయం దీని కోసం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ క్రీస్తు నేర్పిన దయ, ప్రేమ, క్షమాగుణం ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. 2014, 2019లో సీఎం జగన్ విజయం కోసం దైవ సహాయకులు సహకరించారన్నారు. తండ్రి వైఎస్సార్ అడుగుజాడల్లో ఆయన నడుస్తూ సుమారు రూ.2.50 లక్షల కోట్లను ప్రతి పేదవాడి ఖాతాకు జమ చేశారని తెలిపారు. ఇటువంటి జగన్‌ను రెండోసారి తప్పకుండా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 8,500 పాస్టర్లకు గౌరవ వేతనం ఇచ్చిన ఏకైక సీఎం ఆయనని గుర్తు చేశారు. ఈ సందర్భంగా బైబిల్ స్త్రీల చరిత్రలు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ విమలాదేవిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు బిషప్ జయప్రకాష్, స్వచ్ఛాంధ్ర, మాదిగల కార్పొరేషన్ డైరెక్టర్లు ఎస్.సుజాతాపాల్, కందుల ఎజ్రా, వైఎస్సార్ సీపీ యువజన విభాగ జిల్లా అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, కేసరి కోటిరెడ్డి, జిల్లాలోని అన్ని మండలాల పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు, పాస్టర్లు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న విమలారెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, సేవకుల ప్రతినిధులు

రేంజ్ పరిధిలో 51 మంది ఎస్ఐలు ఎంపిక



నగరంపాలెం: రేంజ్ పరిధిలో 15 మంది ఎస్ఐలుగాగా ఎంపికయ్యారు. గతేడాది రేంజ్ పరిధిలో ఎస్ఐల నియామక ప్రక్రియ జరిగిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ఎస్ఎల్‌పీఆర్‌బీ 51 మంది ఎస్ఐ అభ్యర్థులను ఎంపిక చేసింది. దీనిలో భాగంగా శనివారం నియామక పత్రాలు రేంజ్ ఐజీ పాలరాజు ఆయన కార్యాలయంలో అందజేశారు. అనంతరం వారు పోలీసు పెరేడ్‌గ్రౌండ్ నుంచి అనంతపురంలోని టీటీసీ శిక్షణ కేంద్రానికి బయల్దేరారు.

టెట్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

డీఈఓ. వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలో ఏపీ టెట్-2024 పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27నుంచి మార్చి 6 వరకు ఉదయం, మధ్యాహ్నం రెండు సెక్షన్లలో జరుగుతాయని వివరించారు. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ఐదు సెంటర్లలో పరీక్ష జరుగుతుందని వెల్లడించారు. అభ్యర్థుల సందేహాల్ని నివృత్తి చేసేందుకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ప్రతిరోజూ ఉదయం 7 నుంచి రాత్రి 7గంటల వరకు గ్రీవెన్స్ సెల్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. సందేహాల నివృత్తికి ఏపీఓలు జి.జీవరత్నం (98669 04960), పి.శంకరరాజు (9963192487)ను సంప్రదించాలని ఆయన సూచించారు.

మహిళ మెడలో గోల్డ్ చైన్ స్నాచింగ్‌కు యత్నం

- గార్లపాడు సెంటర్‌లో కేకలు పెట్టిన మహిళ
- ప్రాణాలకు తెగించి దొంగను పట్టుకున్న వైఎస్సార్ సీపీ నేత నరసింహారావు
- అభినందించిన మంత్రి అంబటి, స్థానికులు

సత్తెనపల్లి: మహిళ మెడలో చైన్ స్నాచింగ్‌కు యత్నించి ఓ యువకుడు విఫలం చెందిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలో శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని 2వ వార్డు రైల్వేస్టేషన్ సమీపంలో నివసిస్తున్న అత్తులూరి పద్మావతి గార్లపాడు సెంటర్‌లో గీతా మందిరం ఎదురుగా ఉన్న అమరావతి డ్రై ఫ్రూట్స్ దుకాణంలోకి వెళ్లారు. అక్కడ వాటిని కొనుగోలు చేసి నగదు చెల్లిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి తలకు హెల్మెట్ ధరించి మెడలోని బంగారు గొలుసు లాక్కొని పారి పోయేందుకు యత్నించాడు. ఆమె పెద్దగా కేకలు వేసి ద్విచక్ర వాహనాన్ని గట్టిగా పట్టుకుంది. అదే సమయంలో అటుగా వెళుతున్న వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు వల్లెం నరసింహారావు ప్రాణాల్ని సైతం లెక్క చేయకుండా వెంటపడి బంగారు గొలుసు అపహరించిన వ్యక్తిని పట్టుకున్నాడు. అతడు వదిలించుకునే క్రమంలో వాగ్వివాదానికి ఇగాడు. అయినప్పటికీ ఏమాత్రం బెదరకుండా నరసింహారావు వదిలి పెట్టకుండా పట్టుకొని, స్థానికుల సాయంతో పట్టణ పోలీసులకు అప్పగించారు. తన మెడలోని గొలుసు రూ. 3 లక్షలు విలువ ఉంటుందని, సమయానికి దేవుడిలా వచ్చి కాపాడాడని ఆమె వల్లెం నరసింహారావుకు కృతజ్ఞతలు తెలిపింది. స్థానికులు కూడా ఆయన్ను అభినందించారు. చైన్‌స్నాచర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, నరసరావుపేట పట్టణంలోని రామిరెడ్డిపేటకు చెందిన బైక్ మెకానిక్ విజయ్‌కృష్ణగా గుర్తించారు. పిడుగురాళ్ల, దర్శి, తదితర ప్రాంతాల్లోనూ గొలుసు దొంగతనాలకు పాల్పడినట్లు సమాచారం. పట్టణ పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నారు. ఎన్నోచోట్ల చైన్ స్నాచింగ్ దొంగతనాలకు పాల్పడి తప్పించుకు తిరుగుతూ నేరాలకు పాల్పడుతున్న వ్యక్తిని పట్టుకున్న నరసింహారావును పోలీసులు సైతం ప్రత్యేకంగా అభినందించారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం ఆయన్ను దుశ్శాలువాతో ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబూరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, నాయకులు అచ్యుత శివప్రసాద్, మర్రి సుబ్బారెడ్డి, ఈవురి బ్రహ్మారెడ్డి, ఉడుముల వెంగళరెడ్డి, ఉల్లంఘుల ప్రసాద్‌బాబు, చిలుకా నాగేశ్వరరావు, మందడపు సాయి ఉన్నారు.



నరసింహారావును సత్కరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు, నాయకులు



చైన్ స్నాచర్ విజయ్‌కృష్ణ

29లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

నరసరావుపేట: జిల్లాలోని వాణిజ్య సంస్థలు ఈనెల 29లోపు తప్పకుండా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా సహాయ కార్మిక కమిషనరు జి.ధనలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ దుకాణాలు, సంస్థల చట్టం- 1988ను అనుసరించి రిజిస్ట్రేషన్ తప్పనిసరని ఆమె స్పష్టం చేశారు. ఉద్యోగులు ఉన్న, లేని వ్యాపార సంస్థలు కూడా లైసెన్స్‌లు పొందాలని సూచించారు. సమీప సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.